# 6
# మట్టి గుర్రాలు

*"నేనెవర్ని?... ఈ ప్రపంచంలో, లేదా ఈ సమాజంలో నా స్థానం ఏమిటి? ఇంతటి అభద్రతాభావంతో ఎవరి కైన ఏమయినా చెప్పగలిగిన ప్రజ్ఞ నాకెక్కడిది... ఇక్కడ నా ఉనికే ప్రశ్నార్థకమైనపుడు, అస్థిరమైనపుడు నా మాటకు విలువేముంది..."*

ఒక పెద్ద భూగోలం వంటి గుండ్రటి ఆకారం తలగా... కళ్ళ స్థానంలో రెండు గుంటలు... వాటిల్లో నుండి అగ్నిజ్వాలలూ... నోట్లో నుండి రెండు పొడవాటి కోరలూ... ఆకోరల్లో నుండి అగ్నికీలలూ... ఏమిటా ఆకారం.... ఏమయి వుంటుంది?...

వెన్నులో నుండి వొణుకు పుట్టి చప్పున కళ్ళు తెరిచాన్నేను...

*ఇహైకస్థం జగత్కృత్స్నం పశ్చాత్య సచరాచరమే*
*మహాదేహే గుడాకేశా యచ్చాన్యద్రష్టు మిచ్ఛసి*

భగవద్గీత పెట్టినందుకు కాబోలు కండక్టరు మీద గయ్యిమంటూ లేచిన కుర్రాళ్ళు అదాపించి ఒక యాక్షన్ ఫిల్మ్‌ని టివి కెక్కించారు.

జివ్వుమంటూ దూసుకొస్తున్న చలిగాలి కొంత ఉపశమనాన్ని ఇస్తున్నట్టుగా అన్పించి... నింపాదిగా వెనక్కి వాలి కళ్ళు మూసికొన్నాను. ఈ ఓల్వో బస్సుల్లో ఉండే సౌకర్యమిదే. శరీరాన్నయితే వాల్చాను కానీ మనసును నింపాదిగా ఉంచుకోవడం సాధ్యం కావడం లేదు.

ఇవ్వాళా, రేపూ సెలవుల కోసం నాయనమ్మల్ని, తాతయ్యల్ని చంపడం చాలా తేలి

కైతే అయ్యుండొచ్చు... నాకైతే ఈ రోజు సెలవడగడం కోసం నాయనమ్మ నిజంగానే చచ్చిపోయిందని చెప్పాలంటే నోరాడలేదు.

"ఎందాకమ్మా?" ప్రక్కనావిడ ప్రశ్నతో బలవంతంగా కళ్ళు తెరిచాను. బరువుగా ఉన్నాయి కనురెప్పలు...

"నెల్లూరు," చెప్పాను.

" మేము కూడా నెల్లూరే... అడ దిగి పెనవర్తికి పోవాల.... నా చిన్నకూతురుం డాది.... మనిషొచ్చుంటాడు... ఆరయిపోతాదట నెల్లూరుకి పొయ్యేలోపల..." అన్ని వివరాలు చెప్పేసిందామె. తన పేరు మాత్రమే చెప్పలేదు. తనకి ఆ వైపుగా కూర్చుని ఉన్నది పెద్దకూతురని కూడ చెప్పింది.

" అలాగా," అన్నాను అనాసక్తంగానే.

ఇలా బస్సుల్లో కూర్చుని ప్రక్కవాళ్ళతోనో, వెనక వాళ్ళతోనో బాతాఖానీలు కొట్టడం నాకిష్టముండదు... నా చిన్నపుడు నాయినమ్మ బస్సు ప్రయాణాల్లో పక్కవాళ్ళతో లోతైన పరిచయాలు పెంచుకోవడం... వాళ్ళ కష్ట సుఖాలు వినడం... అప్పుడప్పుడూ వాళ్ళని ఇంటిదాకా తీసుకొచ్చి భోజనాలు పెట్టి పంపించడం కూడ కద్దూ......

అయితే నేను పెద్దదాన్నయి బస్సుల్లో ప్రయాణించడం మొదలు పెట్టాక ఎవరూ పక్కవాళ్ళతో మాట్లాడడం లేదు. ఈ హైటెక్ బస్సుల్లో అయితే మరీను.....

"కిటికీ తలుపేస్తాం... చలిగా ఉంది...." చెప్పిందామె.

'ఆ గాలితో నేను మాట్లాడుకుంటున్నాను.... నా దుఃఖాన్ని పంచుకుంటున్నాను...' అనబోయి మళ్ళీ పిచ్చిదాన్ననుకుంటుందేమోనని మౌనంగా గాజు తలుపు లాగేశాను.

"ఉండేది నెల్లూర్లోనా?"

నేనెక్కడ కళ్ళు మూసుకోంటానోనని నాకా అవకాశమివ్వకుండా అడిగేసిందామె.

"కాదు బెంగుళూర్లోనే... ఉద్యోగం చేస్తున్నాను... మా నాయినమ్మ... చనిపోయిం దని ఫోనొస్తే వెళ్తున్నాను. నెల్లూర్లో దిగి కొత్తపాళెం పావాల," ఇంక నన్నేమి ప్రశ్నించొ ద్దన్నట్టుగా చెప్పేశాను..

"చ్చొ చ్చొ చ్చొ... అయ్యో నాయినమ్మకి బాగలేకుండా వుణ్ణిందా?" వదల్లేదామే.

నేను మాట్లాడలేదు.

"ఎంత వయసుంటాది?"

" డెబ్భయిరెండు," చెప్పి మళ్ళీ వెనక్కి వాలి కళ్ళు మూసుకున్నాను...

నాయినమ్మ స్మృతుల్ని నెమరు వేసుకోనీయకుండా భలే కేసే దొరికింది... నాయినమ్మతో నా అనుబంధం అనిర్వచనీయమైంది.. నా తర్వాత రెండుసార్లు వెంట వెంటనే గర్భస్రావం జరగడం... ఆ తర్వాత తమ్ముడు కడుపున పడ్డంతో అమ్మ ఎక్కువ భాగం పుట్టింట్లోనే వుండేదట... నేను నాయినమ్మతోనే వుండేదాన్ని.

వెన్నల రాత్రుళ్ళలోను, వాన వస్తోన్న పగళ్ళలోనూ నాయినమ్మ ఎన్నెన్నో కథలు చెప్పేది... ఏడుచేపల కథ నుండి ఎయిర్‌హోస్టెస్‌ల అనుభవాల వరకూ నాయినమ్మకి

తెలీని విషయమూ, రంగమూ వుండేవి కావు.... కథలే కాదు ఎన్నేన్నో ప్రపంచరీతుల్ని కూడ తెలిపిందామే మాకు, రామాయణంలోను, భాగవతంలోనూ, భగవద్గీతలోనూ ఎక్కడ ఏచిన్న అనుమానమొచ్చిన నాయినమ్మ నడిగితే చాలు, చాలా సవివరంగా తెలియచెప్పేది... అవన్ని ఆమే నాలుక చివరనే ఉండేవి.... వయస్సు మీద పడిన తరువాత కూడా జ్ఞాపకశక్తి తగ్గకపోవడం అమెలోని విశేషం....

ఆ రోజుల్లోనే నన్ను, మా మేనత్త కూతుళ్ళని కుర్చోబెట్టుకొని అమ్మాయిలకు పెళ్ళే జీవిత పరమావధి కాదనీ... బాగా చదువుకొని మగపిల్లల్లాగే ఉద్యోగాలు చేయాలని భోదించింది....

ఒకటా, రెండా నాయినమ్మా జ్ఞాపకాలు... అయితే నేను ఉద్యోగంలో చేరినప్ప ట్నుంచీ నా పెళ్ళి గురించి మధనపడేది...

ఎన్నో సమస్యల్ని, కష్టాలనీ చీల్చుకొని... మరెన్నో చుట్టుపక్కల జీవితాలకు ఆలంబనై, మార్గదర్శకమై రాజసంగా, పరిపూర్ణంగా జీవించిన నాయినమ్మ నా పెళ్ళిని మాత్రం ఈ భూమ్మీద మిగుల్చుకుని వెళ్ళిపోయింది.

ఉన్న పళంగా పొంగుకొచ్చిన దుఃఖాన్ని తట్టుకోలేక నా ఒళ్ళో నేనే తలపెట్టుకొని ఏడవసాగాను....

"ఏడవబాకమ్మా... మనం మాత్రం ఇక్కడే ఉంటామా చెప్పు?... అందరం పోయే వాళ్ళమే... కాకుంటే కొంచెం ముందూ, వెనకా అంతే. ఏడవబాక తల్లీ... అయ్యో ఒంటరిగా ప్రయాణ ం చేస్తుండావే..." నా వీపు మీద చేయి వేసి నిమురుతూ నాతోపాటు అమె కూడా కళ్ళనీళ్ళు పెట్టుకుంది.... ఆవైపుగా కూర్చున్న ఆమె కూతురు కూడ ఏదో అంటోంది... వాళ్ళ ముందు అలా బయటపడ్డం ఇబ్బందిగా అన్పించి మెల్లిగా నన్ను నేను అదుపులోకి తెచ్చుకొన్నాను.

ఇవన్నీ ఏమీ పట్టనట్టుగా బస్సు మాత్రం చీకటిని చీల్చుకుంటూ సన్నటి తారు రోడ్డు మీద వేగంగా జారిపోతూంది... నాయనమ్మ ఆలోచనల్లో నుండి మెల్లిగా మగతలోకి జారుకున్నట్టున్నాను... చాలాసేపే గడచినట్టుంది...

"కొంచెం యిట్టొస్తావా తల్లీ వాంతి కొచ్చేట్టుంది... బస్సులో ఎక్కానంటే యింతే తల్లీ కడుపులో తిప్పతాది..." అంటూ మళ్ళీ పిలిచిందామె. కిటికీ సీటు వదలడం ఇష్టం లేకపోయినప్పటికీ తప్పనిసరిగా జారిపోతున్న దుపట్టాని సరిచేసుకుంటూ ఆవతలికి మారాను ఆమె కూతురు ఆమెతోపాటుగా మధ్యలోకి మారింది.

రెండో... రెండున్నరో అయినట్టుంది... అప్పటికి టి.వి. కట్టేసి కండక్టరు కూడ నిద్రకొరిగినట్టున్నాడు. బస్సంతా గాఢనిద్రలో జోగుతోంది. మళ్ళీ ఆలోచనల్లోకి. అందులో నుండి మగతలోకి జారుకున్నాను... ఎంతసేపు అలా నిద్రావస్థలో ఉన్నానో తెలీదు...

" అమ్మా... అమా... అమా.... అమ్మా," అంటూ ఆమె ఏడుపు విని బిర్ర బిగుసుకుపోయి కళ్ళు తెరిచాను.

ముందు మంద్రస్వరంతోనూ... ఆ తర్వాత బిగ్గరగానూ ఉన్న ఏడుపు విని బస్సంతా నిద్రలేచింది....

నేను విస్తుపోతు ఆమెకేసి చూశాను.

కిటికీ సీట్లో మూలకానుకుని నిద్రపోతున్నట్టే ఉందామె.

అందరమూ ముందూ, వెనకా పోవల్సిన వాళ్ళమేనంటూ నిరూపించి నన్ను ఓదారుస్తున్నట్టుగానే ఉందామె.

అమెకూతురెందుకో ఏడుస్తోంది....

'హార్ట్ ఫెయిల్యూరై ఉంటుంది,' పక్కవాళ్ళెవరో అంటున్నారు. అప్పటికే డ్రైవరు బస్సాపడం, అంతా మా చుట్టూ గుమిగూడడం జరిగిపోయింది.

నా గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి.

దిగ్భ్రాంతితో నా శరీరమంతా అచలనమైపోయింది.

రాత్రంతా నన్నూ, నా ఆలోచనలకూ అంతరాయం కల్గించిందని నేను విసుక్కున్న ఈ అమ్మ ఇంక లేదా?...

అయ్యే ఎక్కడికెళ్ళిందీమె... ఏమైపోయిందింతలోనే... మనిషి ఉండడానికి, లేకుండా పోవడానికి మధ్య ఇంత సన్నని విభజనరేఖ...?

శిరీష వాళ్ళ పక్కింట్లో ఉండే రేఖ వాకిట్లో పాపకి అన్నం తినిపస్తూ తినిపిస్తూ లోపలి కెళ్ళింది మంచినీళ్ళు తీసుకురావడానికి... గ్యాస్ పేలింది. కారణమేదయినా సరే... జీవితానికీ, మరణానికీ నడుమ గల సన్నని సాలే పట్టుదారాలు ఇంత పుటుక్కు, పుటుక్కున తెగిపాతాయని అప్పుడే అర్థమయింది నాకు...

"ఎన్ని చెప్పావమ్మా నిన్న సాయంత్రం నుండీ... చెల్లిని చూడాలని ఎంత ఆతృత పడ్డావు... దానికిష్టమైనవన్నీ చేసి పెట్టాలన్నావే... చెల్లిని మనింటికి తీసుకుపోదామని వచ్చి.... నువ్వెక్కడికెళ్ళిపోయావమ్మ...?" గుండెలు బాదుకుంటోందామె... మళ్ళీ అంతలోనే,

"అయ్యా డ్రైవర్.. త్వరగా పోనీ.. మా అమ్మ బతికే ఉంది... ఆస్పత్రిలో చూపిద్దాం... ఎంత ఖర్చయినా ఫర్వాలేదు..." అంటూ డ్రైవర్నీ, కండక్టర్నీ తొందర చేస్తోంది.

బస్సంతా నిరామయంగా చూస్తోంది తల్లీకూతుళ్ళని....

అప్పటికే బస్సు నెల్లూరు టౌనులోకి ప్రవేశించింది... మెల్లిగా.

" మామయ్యకేమయింది?" ప్రశ్నించాను ఆశ్చర్యంగా...

రమణమామ అమ్మకి చిన్నమ్మ కొడుకు... మామయ్య కూతురు శిరీష నాకంటె రెండేళ్ళు చిన్నది. కొంచెం మందంగా ఉంటుంది ... పెళ్ళయి రెండేళ్ళయింది.

"ఏమయిందంటే ఏం చెప్తాం?... శిరీషని కారణం లేకుండా తరిమేశారని రెండు మూడుసార్లు వెళ్ళి నిలదీశాడు వాళ్ళని... మూడోసారి వెళ్ళినపుడు మాటా మాటా వచ్చి ఏమనుకున్నారో ఏమో... బాగా తన్ని పంపించారు... వెంటనే తీసుకెళ్ళి హాస్పిటల్లో చేర్చాము... అదిగో యిదిగో అని రెండు రోజులున్నాడంతే... శిరీషనే కలవరిస్తా ప్రాణం

పోయింది హాస్పిటల్లోనే... ప్చ్..." బొంగరు బొంగురుగా అమ్మ చెప్తొంటే రమేష్ కళ్ళ నీళ్ళు పెట్టుకుంటున్నాడు.

"కొత్తగా ఉద్యోగంలో చేరావు కదా... సెలవు దొరుకుతుందో, దొరకదో ఎందుకు లెమ్మని నీకు చెప్పలేదు..." చెప్పుకుపోతుంది అమ్మ.

రమేష్‌నే చూస్తున్నాను నేను.

కాలేజీ చదువులు ముగిసి ఇంకా పూర్తిగా ఇంటికొచ్చాడో లేదో కుటుంబ భారమంతా నెత్తిన పడటంతో వడలిపోయి ఉన్నాడు రమేష్... ఉద్యోగాన్వేషణ క్కూడ ఇంకా మనసు మళ్ళినట్టులేదు... అదే అడిగాన్నేను....

"అసలిప్పుడు శిరీష పరిస్థితేంది?... అమ్మ చూస్తే పైకి లేవడం లేదు... ఇదంతా ఇట్టుంటే శ్రీనాద్ శిరీష భర్త మీదికి యుద్ధానికి పోదామంటాడు... వాడేప్పుడేం చేస్తాడో, ఏమయిపోతాడోనని భయంగా ఉంది... ఇంకా చదువు కూడా పూర్తికాలేదు..." గాద్గదిక మవుతోన్న గొంతుతో తమ్ముడి గురించి ఆందోళన పడ్డాడు రమేష్.

ఎక్కడ పట్టిన ఇదే అయిపోయింది. కక్షలూ, కార్పణ్యాలూ చిన్న మాట నువ్వన్నా వంటే నేనన్నానని తిట్టుకోవడం... కొట్టుకోవడం... చంపుకోవడం కూడా చాలా తేలికయి పోయింది మనుషులకి. మన రంగమ్మ కొడుకు గురుకుల పాఠశాలలో చదువుతుండే వాడు చూడు 'మధు' అని... వాడ్నెవరో హస్టల్ నుండి తీసుకెళ్ళి క్షుద్రపూజల కోసం నరికి చెరుకు తోటలో పారేశారంట... రంగమ్మ మంచానికంటుకు పోయింది. పనికొచ్చి మూడు నెలలయిపోయింది. చెప్తినే.... చంపడం చాలా సులువైపోయింది మనుషులకి ...ప్చ్," గుండె గొంతులో కొస్తుండగా చెప్పింది అమ్మ.

చాలాసేపు ఎవరమూ మాట్లాడుకోలేదు.

అందరిలోనూ ఏదో అలజడి... ఆందోళన... అశాంతి...

అసలే ఉడుకురక్తం ... విద్యార్థి ఉత్సాహం... తండ్రి మరణించాడన్న ఉక్రోషం... శ్రీనాధ్ ఎప్పుడెళ్ళి శిరీష భర్తని ఏంచేస్తాడోనని ఇంటిలిపాదీ ఆందోళన చెందుతున్నట్లుగా అర్థమయింది. ఈ ఆందోళన అందరినీ నానమ్మ మరణం తాలూకు ఆలోచనలనీ, దుఃఖాన్నీ అధిగమించినట్లుగా వుంది.

నాయనమ్మని ఇంట్ల అంతా ఇంత త్వరగా ఎలా మరిచిపోగలిగిరా అంటూ లోలోపలే మధనపడుతూండిన నాకు సమాధానం దొరికినట్టయింది.

సాయంత్రం వెళ్ళి అత్తయ్యనీ, శిరీషనీ చూసి రావాలనుకున్నాను. నాకంత వ్యవధినీ, స్థిమితాన్నీ ఇవ్వకుండానే రమేష్ జేబులోని సెల్‌ఫోన్ మోగింది... ఏదో కొత్త ధ్వనితో...

✦ ✦ ✦

రెండు, మూడు తాటిమాన్ల నిలువున్న ఆ మనిషి అనేక చేతులూ, అనేక కాళ్ళూ, అనేక తొడలూ, ఎన్నేన్నో కళ్ళూ, మరెన్నో నోళ్ళూ... లెక్కింపజాలనన్ని కోరలూ.. కళ్ళలో

నుండీ బయటికొస్తున్న అగ్నిజాలలూ... ఆ భయంకరాకారాన్ని చూడ్డానికే సాధ్యంకాని పరిస్థితుల్లో చాలా మంది నాకు తెలిసినవాళ్ళూ, చూడనివాళ్ళు ఎన్నెన్నో మానవాకారాలు ఆ నోళ్ళల్లో నుండి ... ఆ మంటలు నిండిన నోళ్ళల్లో నుండి లోపలికి ప్రవేశిస్తున్నారు.

నాయనమ్మ, రవణమామ, కిటికీసీటామె... పక్కింటి రేఖ... రంగమ్మ కొడుకు... నా చిన్నప్పటి స్నేహితురాలు రాజేశ్వరి, కమల, నాగనళిని, ఇంకా రాజకీయ నాయకులెవరెవరో... కర్నూలు లక్ష్మి... శ్రీశైలం పుష్పక్క... పద్మ... పోలీసాఫీసరు తల్లి... అంతా... ప్ఛ్... అంతా ఆ నోళ్ళలో నుండి వెళ్ళిపోతూ ఉన్నారు.

మరికొందరు మనుషులు ఆ భయంకరాకారపు పండ్ల సందుల్లో చిక్కుకొని పొడిపోయిన శరీరాలతో... హబ్బా చూడ్డానికే దారుణంగా ఉందా స్థితి... మరోవంక ఆ ఆకారం చుట్టూ అనేకమంది మనుషులు మోకరిల్లి ప్రార్థనలు చేస్తున్నారు.

"ఆదిమధ్యాన్తరహితుడైన ఓ దేవదేవా... నువ్వేవరవు? అశాంతితో రగిలిపోతున్న ఈ భూమ్మీది ప్రజలను కాపాడ్డానికే నువ్వొచ్చి ఉన్నట్టయితే... ఇంత భయంకరంగా మమ్మల్నంతా ఎందుకు భయపెడుతున్నావు? శాంతించు తండ్రీ శాంతించు..." అంటూ మా ఊరి పూజారి ఆ అగ్నిగోళం వంటి నోట్లోకి వెళ్ళి ఐక్యమైపోయాడు.

"దేవుడివో రాక్షసుడివో ... పుట్టింది మొదలూ మట్టిని నమ్ముకున్నవాళ్ళం... ఆ మట్టి కూడ మమ్మల్ని మోసం చేస్తోంది... ఎరువులు కల్తీ.. విత్తనాలు కల్తీ... మందులు కల్తీ... మనుషులు కల్తీ అయి చివరికి మట్టి కూడా కల్తీ అయిపోయి మాలో ముప్పాతిక వంతు రైతులు ఆత్మహత్యలు చేసుకోగా... వలసపోయిన వాళ్ళు పోగా... ఇంకెవరున్నారని ఉద్ధరించడానికొచ్చావు...." బక్కపేగులూ, చింపిరి గడ్డాలతో ఉన్న వ్యక్తులు కొంతమంది పరుగు పరుగున ఆ నిప్పు నోళ్ళల్లోకి ప్రవేశిస్తున్నారు... వాళ్ళు అంతకు ముందే ఆత్మహత్య చెసుకోవడానికి నిర్ణయించుకున్నవారిలా ఉన్నారు...

అదిగో నాయనమ్మ ... హై... వాళ్ళని ఎదురొచ్చి ఆహ్వానించి తీసుకెళ్తోంది.. నాయినమ్మకి రైతులంటే చెప్పలేనంత అభిమానం. ఎందుకంటే ఆమె కూడ ఒక రైతే... తాతయ్య పోయిన్నాటి నుండీ మా పొలాన్నంతా ఆమె ఒక్క చేత్తో పండించి చక్రం తిప్పింది. నాలుగయిదేళ్ళుగా పంటలు పండడం లేదని మధనపడేది. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందనేది. లోకానికి అన్న పెట్టే రైతు చివరికి అన్నముద్దకి కరువొచ్చి అంగలార్చడాన్ని అమె తట్టుకోలేకపోయేది.

ఋణబాధల్తో రైతులు ఆత్మహత్యలు చేసుకోవడాన్ని విని, చదివి కళ్ళనీళ్ళు పెట్టుకునేది. దేశానికి రైతు వెన్నుముక అన్న మహాత్ముడి మాటల్ని పదేపదే గుర్తు చేసేది. అందుకే కాబోలు ఆ రైతులందర్నీ నాయినమ్మ సాదరంగా ఆహ్వానించి తీసుకెళ్తోంది. వాళ్ళందరినీ ఆ అగ్నిజ్వాలలేవి అంటుతున్నట్లుగా లేవు.

"ఓ మహాపురుషా... మనిషికి శీలం ముఖ్యమని నమ్మి... శీలాన్ని నిర్మించే విద్య కావాలని, 'వ్యక్తిశీల నిర్మాణం' అన్న సబ్జెక్టని కళాశాల విద్యార్థులకు పెట్టాలని

ఎంతగానో ప్రయత్నించి విఫలమయ్యాను... పిల్లల మీద చదువుల భారం... ఒత్తిడి తగ్గించాలని చూశాను... నన్ను పిచ్చివాడిలా చూశారు... ఎండల్లో తరగతులేంది?... వేసవి సెలవుల్లేకుండా అన్నాను. నా గోడు ఎవరూ పట్టించుకోలేదు... శీలం లేకుండా పక్కదారులు పడ్తోన్న యువతను ఏ మాయల మరాఠీ వచ్చి రక్షించగలడు?..." మా ఊరి జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ విరక్తిగా ఆ అగ్నిగోళంలోకి వెళ్ళిపోయాడు నడుచు కుంటూ.

"మహానుభావా... మేము చాలాచాలా పాపాలు చేశాము... బీదా, బిక్కీ, పెద్దా, చిన్న లేకుండా అందరివద్దా లంచాలు తిన్నాం... ఎంతో డబ్బు ఒకేసారిగా సంపాదిం చేయాలని ఆరాటపడ్డా. పేదలకు ఇళ్ళ స్థలలు ఇచ్చే విషయంలో ఎంతో గోల్‌మాల్ చేశాం..." ఇంకా అతడితో పాటు అనేకమంది అధికారులూ వేగంగా వేళ్ళి ఆ ఆకారపు పంటి సందుల్లో ఇరుక్కుపోయి లోపలికెళ్ళాలో, బయటికి రావాలో తెలీక తనకలాడు తున్నారు.

"ఆదిపురుషా... పేద దళితులు చిన్నచిన్న ఋణాలిప్పించమని వస్తే తన్ని తగలేసి, తిరిగి చెల్లించనటువంటి బడా వ్యాపారులకు లక్షలు లక్షలు లోన్లిప్పించాం ప్రభుత్వాన్నుండి..." అంటూ మా ఊరి బ్యాంకు మేనేజర్లిద్దరూ ఆ అగ్నినోట్లోకి దూరి పోయారు... మా ఊళ్ళో రెండే బ్యాంకులున్నాయి...

అప్పుల్విడంలోను, ఇచ్చిన ఋణాలు వసూలు చేయండంలోనూ పేద రైతుల్ని నానా బాధలూ పెడ్తున్నారని బ్యాంక్ మేనేజర్లతో నాయినమ్మ ఎప్పుడూ గొడవ పడుతూ ఉండేది...'ఈ అధికారులకంతా ఏనుగులు దూరిపోయే కంతలు కన్పడవు... ఇట్లా చిన్న చిన్న ఎలుకలు దూరే కంతల్ని మాత్రం పట్టుకుంటారు... రైతుల మీద, రైతు కూలీల మీద, పేదోళ్ళ ఇళ్ళ మీద మాత్రం ఋణాలు చెల్లించమని దాడులు చేసి... కుండా, గుడ్డా, చట్టీ, కోచీ బయట పారేస్తారు...' అంటూ ఈ బ్యాంకోళ్ళని నాయినమ్మ అధిక్షేపించడం అనేకసార్లు వింది తను.

ఆ ఇద్దరు మేనేజర్లూ అగ్ని నోట్లోకి దూరిపోయారు.

"అవతారపురుషా! నేనీ ఊరికొచ్చి నాయకులు చెప్పినట్టనల్లా ఆడాను... గత్యం తరం లేక అలా ప్రవర్తించానే తప్ప నాకూ అమాయక జనాల్తో ఆడుకోవాలని లేదు... మొదట్లో ఎంతో నిజాయితీగా పీడిత జన పక్షాన నిలబడ్డాను... నన్ను ఫుట్‌బాల్ ఆడుకున్నట్టు ఆడుకున్నారు మహానుభావా... నాయకులంతా... ఒకచోట స్థిమితంగా ఉండనిచ్చేవాళ్ళు కాదు... నేను బాగుంటేనే కదా ఎవరి పక్షానయిన నిలబడగలిగేది.... అందుకే, నా బాగు నేను చూసుకున్నాను. మన్నించు తండ్రీ..." మా ఊరి ఎస్.ఐ. ప్రాణాల మీద తీపితో తకబికలాడుతూనే ఆ నోట్లోకి మాయమయ్యాడు.

విదేశీ కార్ల కోసం... ప్రపంచబ్యాంకు ఆదేశాలతో వేసిన మా జిల్లా రోడ్లకి ధన దాహంతో పాటు రక్తదాహం కూడ ఎక్కువయిపోయింది.

ఇదిగో టవును దాకా వెళ్ళొస్తామంటూ స్నేహితుడితో కలిసి మోటార్‌సైకిలు మీద వెళ్ళిన శ్రీనాథ్... ఉద్యోగధర్మం మీద వెళుతూ విలేఖరులిద్దరూ... అత్తగారింటి కెళ్తున్న కొత్త పెళ్ళికొడుకూ... తిరుపతి యాత్రకు వెళ్తూ వెళ్తూ అనేక దూరప్రాంతాల కార్లూ, వాహనాలు మొత్తం అన్నీ కలిసి రక్తమోడుతూ ఆ రోడ్డు.... మొత్తంగా కంప్యూటర్ గ్రాఫిక్స్ మాదిరి ఆ అగ్నిగోళాల్లోపలికి వెళ్ళి మాయమైపోయింది.

ఆ మంటల్లో నుండీ, ఆ నోళ్ళల్లో నుండీ రక్తం కారుతోంది వికృతంగా, అక్కడే నిల్చుని నాయనమ్మ కళ్ళల్లో నుండి నీళ్ళు కారుతున్నాయి ధారాపాతంగా...

"మాకు పోలీసులు శత్రువులు కాదు... మిత్రులే... ప్రజాస్వామమే లేని ప్రభుత్వం తరపున ఏజంట్లుగా ప్రవర్తిస్తున్నందుకే మా కోపం తప్ప మరేమీ కాదు.. మేం చేస్తున్నది ప్రజాపోరాటం... ర్యాపు అణచివేత స్వభావాన్నీ ఎదుర్కోవడంలోనూ, బూటకపు ఎన్ కౌంటర్లు, కూంబింగులనూ ఆపడంకోసం తప్పనిసరిగా ఆయుధాలనుపయోగిస్తున్నామే తప్ప పోలీసులు మా శత్రువులు కాదు.

"ఉన్నతమై ప్రజాస్వామికవ్యవస్థ కోసం... విప్లవ ప్రతిహింసను మార్గంగా ఎంచుకున్న మా ప్రజావిముక్తి పోరాటాలను అణిచివేయాలని చూస్తోంది రాజ్యం... ప్రజాస్వామిక ప్రజా ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకునేదాకా ఇది తప్పనిసరి... నువ్వే చెప్పావట కదా దుష్టశిక్షణ చేసి తీరాలని... ఆ క్రమంలో కొంతమంది అమాయకులు కూడ బలవకతప్పదు. సారీ..."

"ఈ చంపుడు పందేల యాగంలో సమిధలమై మనశ్శాంతి లేకుండా పరుగులు పెడుతోన్న మమ్మల్ని ఈ విధంగా కాపాడ్డానికొచ్చావా నాయినా?... ఒక వ్యక్తి యొక్క జీవించే హక్కుని హరించే హక్కు వీళ్ళకెవరిచ్చారు... పరస్పరం చంపుకుంటూ పోవడం మాత్రమే పరిష్కారామా? మేం ఒంటరిగా ఉన్నపుడో... మందితో ఉన్నపుడో... పక్కవాళ్ళతో కలిసో, కలవకో... పొట్టకూటి కోసమో ఏదైనా తప్పులు చేసి ఉంటే మన్నించు తండ్రీ" అంటూ మామూలు మనుషులంతా మహదానందంగా వెళ్ళి అ మంటల్లోకి... అ మంట లొస్తున్న నోళ్ళలోకి దూరిపోతున్నారు... అదిగో నాయినమ్మ మళ్ళీ వచ్చింది ఈ మామూలు మనుషుల్ని... పేదా సాదాని దగ్గరుండి ఆహ్వానించి తీసికెళ్ళడానికి.

నాయనమ్మ తన కూతుళ్ళకీ, కోడలికీ... మనవళ్ళకీ, మనవరాళ్ళకీ.... ఒక్కమాట చాలా గట్టిగా చెప్పేది. వాకిట ముందు కొచ్చి ఆకలి అన్న వ్యక్తికి గుప్పెడు మెతుకులు పెట్టడం ఖచ్చితంగా అలవాటు చేసుకొమ్మని. పనివాళ్ళని చాలా ఆదరంగా చూసేదామె. సేద్యగాళ్ళకి కడుపు చూసి వడ్డించేది. ఇంటికి కూరలు అమ్ముకోవడానికొచ్చిన వాళ్ళని కూడ ఊరికే పంపేదికాదు.

వేరుశెనగ పండితే పదిమూటలకి తక్కువ లేకుండా బంధుమిత్రులందరికీ పంచేది. 'పెట్టడం అనేది లచ్చిందేవమ్మ దగ్గిర నేర్చుకోవాలి. అమె చెయ్యే చెయ్యి...' అనుకునేవాళ్ళు ఊళ్ళో అంతా.

✦ ✦ ✦

"దేవదేవా.... దేవాదిదేవా పాహిమాం... పాహిమాం..."

"మేము మొదటి నుండీ చెప్తూనే ఉన్నాము... అందరం సామరస్యంగా కూర్చుని చర్చిద్దాం ఆయుధాలని ఒదిలిపెట్టిండి అని. లౌకిక ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ఉద్య మాలెందుకు మహాపురుషా... ఇరుపక్షాల నడుమా అవగాహనారాహిత్యం మూలంగా ప్రజాబాహుళ్యానికీ... ప్రజా సమస్యల పరిష్కారానికీ ఆటంకం ఏర్పడిన మాట వాస్తవమే... ప్రజాస్వామిక ప్రభుత్వంలో ఉండి మా పోలీసుల దుందుడుకుతన్నాన్ని నియంత్రించడం లో మేము విఫలమైన మాట వాస్తవమే అధ్యక్షా... క్షమించుదేవా... మొన్నటిదాకా అసెంబ్లీ సమావేశాలు జరిగినందువల్ల ఈ అధ్యక్షా అనే మాట ఇంకా నాలుక మీదనే ఉండిపోయింది.

"ఏదిఏమైనా ఈ రాజ్యాన్నీ, ప్రభుత్వాన్ని సముద్ధరించడంలో మేము తల మునకలై ఉన్నాం. ప్రస్తుతం మమ్మల్ని క్షమించి మాక్కొంచెం సమయాన్నివ్వు దేవాధి దేవా..."

రాజకీయనాయకులు ఆ విశ్వరూపం ముందు నిలబడి తాము చెప్పదలుచు కున్నదంతాచెప్పి, వెనక్కి వెళ్ళాడానికి ప్రయత్నిస్తున్నారు. ఏ అయస్కాంతపు ఒత్తిడో వాళ్ళని ఆ అగ్నికీలలు వెలువడుతోన్న నోళ్ళవైపుగా సర్రున లాగుతున్నట్లుగా ఉంది.

నాయునమ్మ, నాయినమ్మతో పాటుగా అంతకుముందే లోపలికి వెళ్ళిన బక్క పేగుల రైతులంతా... చప్పట్లు చరుస్తూ నవ్వుతున్నారు రాజకీయనాయకుల్ని చూసి. వాళ్ళ హైటెక్కు అభివృద్ధే వ్యవసాయాన్ని దెబ్బకొట్టిందని తెలీనివాళ్ళు లేరు.

"దేశంలోని గిరిజన, దళిత, ఆదివాసీ... మారుమూల ప్రాంతాలను ప్రభుత్వాలు దశాబ్దాల తరబడి నిర్లక్ష్యం చేయడం వల్లనే ఇవ్వాళ విప్లవపక్షం ఏర్పడి నక్సల్స్ సమస్య జటిలమయిందనీ, నిజానికి ఇది శాంతిభద్రతల సమస్య కాదనీ... సామాజిక ఆర్థిక సమస్యలతో ముడిపడి ఉందనీ నివేదికలు సమర్పించాం... ఉత్పత్తి శక్తుల పెరుగు దలకూ, గొప్ప వనరులు పెరగడానికీ భూ సంస్కరణల అమలు ఎంత అవసరమో తెలియజెప్పాం.... మొత్తుకున్నాం. మా మాటలని ఇరుపక్షాలు... ఆ మాటకొస్తే అసలే ప్రభుత్వమూ కూడ పట్టించుకోలేదు మహానుబావా... మా మేధస్సులు కాలరాయడానికే తప్ప... ఇక్కడ మేం చేయగల్గిందేమిలేదు..." మేధావుల గుంపు ఒకటి తమతమ ఆలోచన లనూ, నివేదికలను సవివరంగా తెలియజేసి నిటారుగా ఒక్కొక్కరే అవతార పురుషుడి నోటిలోకి నడుచుకుంటూ వెళ్ళిపోయారు.

ప్రార్థనలు చేస్తున్నవాళ్ళు అతి కొద్దిమంది మాత్రమే.

అంతకు కొన్నివేల రెట్ల జనాలు మిడతలే విదంగా అయితే వెతుక్కుంటూ వెళ్ళి అగ్నిలోకి ప్రవేశిస్తాయో ఆ విధంగా అమితమైన వేగంతో ఆ భయంకరాకారుడి నోటిలోకి... ఆ కీలాగ్నిజ్వాలల్లోకి వెతుకులాడుతూ వచ్చి దూరిపోతున్నారు.

మొత్తం ప్రపంచమంతా తపనతో వేగిపోతుంది....

పేదలకు వైద్యం చేయడానికి ముందుకురాని మా ఊరి డాక్టర్లు, మా ఇంట్లో వాళ్ళూ... బయటివాళ్ళూ... ఎదురింటివాళ్ళూ... పక్కింటివాళ్ళూ ఒకరని లేదు... ఇళ్ళూ, వాకిళ్ళూ, చెట్టూ, పుట్టా అంతా ఆ నోటిలోకి వెళ్ళిపోతున్నాయి వరుసగా.

ఎక్కడా ఒక చిన్న పిట్ట కూడా కన్పించడంలేదు.

మొత్తం మానవ సమూహాన్నంతా... ఈ సర్వ చరాచర ప్రపంచాన్నంతా లోపలికి తీసేసుకున్నాడా భయంకారాకారుడు.

నేను... నేను మాత్రమే ఎక్కడున్నాను... ఎలా చూడగల్గుతున్నాను?

ఆ విశ్వరూపుడు క్రమంగా మాటలన్నిటినీ లోపలికి తీసుకుని అనేక చేతుల్ని రెండుగా... అనేక నోళ్ళని ఒకటిగా... ఎన్నెన్నో కాళ్ళనీ, తొడలనీ రెండుగా మార్చుకొని... ఒక ప్రసననరూపం దాల్చాడు ప్రత్యేక మైన వర్ఛస్సుతో వెలిగిపోతోందతడి ముఖం...

ఇందాకటి భయంకరమైన అగ్నికీలల్తో నిండిన ఆ వికృత రూపానికీ... ఇప్పటి ఈ తేజోమయ కాంతి స్వరూపానికి ఎక్కడా పోలికే లేదు...

ఇందాకట్నుంచీ అన్పించలేదు కానీ... ఇప్పుడెందుకో భయంభయంగా చూస్తున్నానతడి వంక.

హఠాత్తుగా అతడు మాట్లాడ్డం మొదలుపెట్టాడు.

"కరుణ, ప్రేమ, దయ, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, వ్యక్తిశీల నిర్మాణం.... అన్నీ నూతన విలువలతో కూడిన ఒక కొత్త సమాజ వినిర్మాణంలో నేను... నేనే..."

ఈ వాక్యాన్ని అతడు మూడుసార్లు ఉచ్ఛరించి... ఎడమచేతిలోని ఒక స్వర్ణ కమండలంలో నుండి బంగారువర్ణంలో మెరుస్తోన్న వెడల్పాంటి అతడి కుడి అరచేతి లోనికి నీళ్ళు ఒంచుకొని.... ఆ సువిశాలమైన మైదానం మీద చిలకరిస్తున్నాడు. అతడి పక్కనే శ్వేత అశ్వమొకటి ఉరకలు వేస్తోంది.

మళ్ళీ ఒకసారి కనుచూపుమేర తల తిప్పి చూశాను.

ఎక్కడా ఒక చెట్టు, పుట్టా, పిట్టా, ఇల్లూ, వాకిలీ, మనిషీ, మానూ.... ఏమీ లేవు. సినిమాలో చూసే థార్ ఎడారిలా ఉందా ప్రదేశం.

అ సువిశాలమైన నిర్మానుష్య మైదానంలో తన అస్తిత్వాన్ని వ్యక్తపరుస్తూ గాలి మాత్రమే చప్పుడు చేస్తోంది.

అకస్మాత్తుగా అతడు చిలకరించిన నీటిలో నుండి ఒక మానవాకారం రూపు దాల్చింది. స్త్రీయో, పురుషుడో తెలీనట్లుగా క్రమక్రమంగా స్వరూపాన్ని సంతరించుకుందా ఆకారం.... థెరస్సా.... మదర్ థెరిస్సా.... విస్తుపోయి చూస్తున్నాన్నేను.

మదర్ మెల్లిగా నడుచుకుంటూ వచ్చి పక్కకు నిలచున్న తరువాత ... మరో మానవాకారం..... మరోటి... మరోటి...మరోటి....

నైటింగేల్, మార్క్స్, మావో, అంబేద్కర్, మన్యంవీరుడు అల్లూరి, మహాత్ముడు, సుబాస్‌చంద్రబోస్, మా నాయినమ్మ, నా చిన్నప్పటి మా ఊరి గవర్నమెంట్ డాక్టర్

కృష్ణమూర్తి.... ఆయన్నంతా పేదల డాక్టరని పిలిచేవాళ్ళు.... ఇంకా ఇంకా నాకు తెలీని నేను గుర్తుపట్టలేని మరికొందరు... అర్థమయింది... మనషుల పట్ల జాలి, దయ, ప్రేమ, కరుణ, స్నేహం... గల వ్యక్తులంతా మళ్ళీ ఒక్కొక్కరే ఉద్భవిస్తున్నారు... "నాయినమ్మా...." పెద్దగా అరిచాన్నేను.....

నా గొంతెవరికి వినిపిస్తున్నట్లు లేదు... ఎవరూ పట్టించుకోలేదు... వాళ్ళంతా ఏదో 'మరో ప్రపంచాన్ని' నిర్మించడాని కుద్యుక్తులై ఏకాగ్రతలో నిమగ్నులై ఉన్నారు.

హఠాత్తుగా నేను ఒంటరిగా ఉన్నానన్న విషయం గుర్తొచ్చింది.

అమ్మ గుర్తొచ్చింది... నాన్న గుర్తొచ్చాడు... తమ్ముడు గుర్తొచ్చాడు... ఇక వాళ్ళంతా మళ్ళీ పుట్టరా?... ఇల్లూ, ఇంటి ముందరి గులాబీపూలూ, ఇంకా ఏవేవో జ్ఞాపకాలు... భ్రమలు...

ఆ భ్రమల్నుండి తేరుకోలేక.... బిగ్గరగా ఏడవడం మొదలుపెట్టాన్నేను.

✦ ✦ ✦

"డాలీ...డాలీ...డాలీ...తల్లీ..."

ఎక్కడ్నుంచో చాలా దూరం నుండి ఎవరో పిలుస్తున్నారు. ఇంకా ఎవరో మిగిలే ఉన్నట్టున్నారు... నా పేరు తెలిసిన ఎవరో మిగిలే ఉన్నారు...

నాకు ఏడుపాగడం లేదు... మరింత ఎక్కువయింది.

"ఏంటి తల్లీ ఇది చిన్నపిల్లలా... ఏదైనా కలొచ్చిందా?" బుజ్జగించి అడుగుతున్నాడు నాన్న. అమ్మ ఇచ్చిన మంచినీళ్ళు గటగటా తాగేసి కళ్ళు తుడుచుకున్నాన్నేను. నాన్న ఏదో చెప్పుకుపోతూనే ఉన్నాడు ధైర్యాన్నిస్తూ....

"మన వ్యక్తిగత, సామాజిక జీవితాలలోని ఎక్కువభాగం సమస్యలకూ... దుఃఖానికీ కారణం అనాదిగా వస్తోన్న మన విలువల్ని నిర్లక్ష్యం చేయడమే... మానవజాతి మనుగడకు సంబంధించిన మౌలిక విలువల్ని మనం క్రమక్రమంగా ధ్వంసం చేసేసుకుంటున్నాం...... మనిషి దృష్టి 'మనీ' మీదికి మళ్ళింది..."

ఏదో భయం, అభద్రతాభావం, ఆందోళన, అలజడి చుట్టుముట్టినట్లుగా వున్న నన్ను ఏవేవో అనునయ వాక్యాలతో, మంచి మాటలతో మామూలు మనిషిని చేయాలని చూస్తున్నాడు నాన్న.

"అమ్మా కలిపురుషుడెప్పుడొస్తాడమ్మా.... ఎప్పుడొస్తాడో తెలుసా? నాయినమ్మ ఇంక రాలేదా?" ఉన్నట్టుండి ప్రశ్నించాన్నేను. అమ్మ ఏడుస్తోంది. ఇంటా బయటా జరుగుతున్న వరుస సంఘటనలకు భయపడి కాదు, కూతురేమయిపోతుందోనన్న భయంతో...

విరక్తితో వేల జీతమొస్తోన్న ఉద్యోగాన్ని వొదిలి పెట్టేస్తానేమోనని నాన్న భయం.

మనుషులంతా రకరకాల భయాల పుట్టల్లో తిరుగాడుతున్నట్టున్నారు. మానవత్వం సిగ్గు వల్మీకంలో తలదాచుకున్నట్టుంది, ఏక్కడా కన్పించడం లేదు. "నాన్నా కలిపురుషుడెప్పుడొస్తాడు నాన్నా... నీకూ తెలీదా?"

చెప్పలేనంత అశాంతి నా మెదడునీ, హృదయాన్ని నములుతున్నట్లుగా వుంది... నా కళ్ళు వర్షిస్తున్నాయి.

"నేనెవర్ని?... ఈ ప్రపంచంలో, లేదా ఈ సమాజంలో నా స్థానం ఏమిటి?... ఇంతటి అభద్రతా భావంతో ఏవరికైన ఏమయినా చెప్పగలిగిన ప్రజ్ఞ నాకెక్కడిది... ఇక్కడ నా ఉనికే ప్రశ్నార్థకమైనపుడు, అస్థిరమైనపుడు నా మాటకు విలువేముంది..." నాన్న బహుశా ఇదే ఆలోచిస్తూ ఉండి ఉంటాడు... మాట్లాడలేదు.

"చెప్పు నాన్నా... అయ్యో నాయనమ్మయితే చెప్పి ఉండేదే. నాయినమ్మ... నువ్వు మళ్ళీ బతికావు కదా.... వచ్చేయి మనింటికొచ్చేయి.... నానమ్మా..." మారాం చేశాన్నేను. అమ్మ మరింత బిగ్గరగా ఏడవసాగింది నెత్తి బాదుకుంటూ... 'హూ' దీర్ఘంగా నిట్టూర్చారు నాన్న. నాన్న వెనుకగా తలపక్కన నాయినమ్మ కన్పించీ, కన్పించకుండా నవ్వుతూ చూస్తోంది నావైపు...

"కలి పురుషుడంటూ ఎవరో వచ్చి ప్రత్యేకంగా సమాజాన్ని మార్చేయరమ్మా... నాకు తెలిసినంతవరకూ మార్పు అనేది మనిషి నుండి మొదలవ్వాలి. మనుషులు... వ్యక్తులు... మనక్కావల్సింది వ్యక్తులు... మిగిలినవన్నీ వాటంతటవే సిద్ధమవుతాయి. మనలో ప్రతి ఒక్కరమూ ప్రక్క వ్యక్తి గురించి ఆలోచించాలి. అలోచించగలిగితే... ఈ ఒక్క వాక్యాన్ని మనం లోతుగా తీసుకున్నట్టయితే..."

నాయనమ్మే నాన్నతో మాట్లాడిస్తున్నట్లుగా ఉంది. నాకు ఏదో సూచిస్తున్నట్లుగా ఉంది.

ప్రగాఢ నిశ్శబ్దం... అలజడి, ఆందోళన అంతా తగ్గి వాతావరణం భయ గంభీరంగా ఉంది...

ఆలోచనలో పడ్డాన్నేను. నిజమే! నాకొచ్చే వేల జీతంతో నేనేం చేయగలనో, ఏం చేయుచ్చో కొంత అర్థమయినట్లుగా ఉంది... నాయినమ్మ ఏదో చెప్తోంది... స్ఫూర్తి నిస్తోంది...అమ్మ కిటికీలు తెరిచినట్టుంది.

అప్పటిదాకా గదిలో ఉన్న ఇన్‌డోర్ ప్లాంట్‌తో ఆడుకుంటున్న ఉడతల జంట ఒకటి హడావుడిగా కిటికీ అంతా పాకి బయటికి దూరి పారిపోయాయి....మరోసారి నాతో ఏదో చెప్పి నవ్వుతూ నాయినమ్మ కూడ కిటికీలో నుండి బయటకు వెళ్ళిపోయింది.

జివ్వుమంటూ లోపలికి దూసుకొస్తున్న చలిగాలి కొంత ఉపశమనాన్నిస్తున్నట్లుగా అన్పించింది.

తెలుగు పలుకు, 2005